# పుట్టుమచ్చ



— తంబు

రిక్షా రంగడి కొడుకు రవి, కోటేశ్వ్రరావు గారి ఏకైక పుత్రిక రాధ వేరే పనిలేక పరస్పరం ప్రేమించుకున్నారు. కాబట్టి " ఈ నెత్తావి తెమ్మెరలో నాకు బలే తిమ్మిరిగా ఉంది" అనే పాట మొదటి చరణం ఊటీలో పాడి సైకిలు తొక్కుతూ, రెండో చరణం పాడ్డానికి అరకు లోయలోకి వచ్చారు. అప్పుడు ఆ సైకిలు అందమైన కారులా మారిపోతుంది. అక్కడ రాధ చలేస్తున్నా సరే చచ్చినట్టు నీళ్ళలో మునిగి "అబ్బ లాగుతున్నాయి నరాలు, వేసుకో మన్మథ శరాలు" అనే రెండో చరణం పాడాక కారులో స్పీడుగా బయల్దేరారు.

కథా క్రమం కొద్దీ దార్లో ఏక్సిడెంట్ అవుతుంది. రవి కారులోనే తెలివి తప్పి పడిపోయాడు. రాధ కార్లోంచి కొండ చరియల్లోకి దొర్లి లోయలో ఉన్న గెడ్డం బాబాగారి పూరి పాకలో మంచం మీదకి జాగ్రత్తగా పడింది. రాధ, గోపి గత స్మృతులు కోల్పోయారు. తెలివి తప్పి పడి ఉన్న రవిని రత్నభూషణరావు అనబడే పిల్లలు లేని లక్షాధికారి తీసుకు వెళ్ళాడు.

**సినిమా కథల తీరుపై వ్యంగ్య రచన**

రాధని చూడగానే చిన్నప్పుడు తప్పిపోయిన తన కూతురు, పైడితల్లి జ్ఞాపకం వచ్చి గెడ్డం బాబా ఆమెను అమిత వాత్సల్యంతో చూడసాగాడు.

ఆస్తి కోసం కాకుల్లా కాచుక్కూర్చున్న వారసులకి కాకుండా రవికే రాసిచ్చేద్దామనుకున్న రత్నభూషణరావు దత్తత చేసుకుందామనుకున్నాడు.

ఏక్సిడెంట్ సంగతి తెలిసి రవి తండ్రి రంగయ్య లబోదిబోమంటూ రిక్షా తొక్కుకుంటూ రత్నభూషణంరావుగారిల్లు చేరుకున్నాడు. తండ్రిని గుర్తించలేక తనయుడు రవి "ఎవరు నువ్వు" అని రంగయ్యని అడిగాడు. డబ్బుకి ఆశపడి కన్న తండ్రినే గుర్తుపట్టనట్టు నటిస్తున్నాడనుకుని రంగయ్య "నీలాంటివాడు నాకొడుకే కాదు" అని ఆవేశపడ్డాడు. "అదే నేనూ అంటున్నాను" అన్నాడు రవి అమాయకంగా. కళ్ళ నీళ్ళు గ్రుక్కుకుని, కోపం దిగమింగుకుని రంగయ్య తిరిగి వెళ్ళిపోయారు.

కూతురికోసం వెదికి వెదికి వేసారి కోటేశ్వ్రరావుగారు గెడ్డం పెంచుకుని కళ్ళద్దాలు పెట్టుకుని, శాలువా కప్పుకుని, అస్తమానం ఆస్థమా ఉన్నవాడిలా దగ్గుతూ కూతుర్ని వెదకసాగాడు.

కన్నతండ్రిలా అభిమానంగా చూస్తున్నా కూడా గెడ్డంబాబా ప్రవర్తన రాధకి ఏమాత్రం నచ్చలేదు. చీటికీ మాటికీ సినిమాలో తండ్రిలా "నా తల్లీ నా తల్లీ" అని అనవసరంగా కౌగలించుకోడం, రాత్రి వేళ తన గదిలోకి వచ్చి నడుం మీద చెయ్యి మాత్రమే కాక బేట్రీలైటు కూడా వేసి ఇంకా క్రింది భాగాలు వెదక ప్రయత్నించడం రాధకి ఎంతో భయాన్ని, అందోళనని కలుగచేస్తాయి.

ఒకరోజు రాత్రి గెడ్డం బాబా బేట్రీ లైటుతో తన గదిలోకి దొంగలా రాగానే "ఏమిటీ పని బాబా! నేను నీకు కూతురిలాంటిదాన్ని కదా" అని అడిగింది. "అందుకే తల్లీ ఈ అన్వేషణ" అని బాబా ఆమెను కౌగలించుకోబోయాడు. రాధ తప్పించుకుంది. "నిన్ను చూస్తుంటే తప్పిపోయిన నా కూతురు జ్ఞాపకం వస్తోంది. నా కూతురుకి పిర్ర మీద పుట్టుమచ్చ ఉంటుంది. నువ్వు నా కూతురివే అయివుంటావు. ఏదీ ఒక్కసారి చూడనియ్యి" అని బతిమాలసాగాడు.

"పుట్టుమచ్చ ఉంటే కూతుర్నే అవుతాను. లేకపోతే అంతా చూశాక కూతుర్ని కాదుకదా అని నీకేదైనా దుర్బుద్ధి పుడితేనో" అని రాధ మొరాయించింది. బాబా చూపించమని బలవంతం చెయ్యసాగాడు. రాధ చూపించనని పెనుగులాడసాగింది. రాధ అడవుల్లోకి పారిపోయింది. గెడ్డం బాబా వెంటాడసాగాడు.

రంగయ్య రిక్షాలో దేవుడి గుడికి వెళ్ళి తిరిగి వస్తున్న కోటేశ్వర్రావు రాధని చూసి రిక్షాలోంచి దూకేసి "తల్లీ ఇన్నాళ్ళకి దొరికావా" అని ఆమెను వాత్సల్యంతో కౌగలించుకోబోయాడు. తండ్రిని గుర్తించలేని రాధ "నువ్వు కూడా పుట్టు మచ్చ చూపించమంటావా?" అని చీదరించుకుని పారిపోసాగింది. ఆమె వెనక రంగయ్య రిక్షాలో కోటేశ్వర్రావుగారు, వారి వెనక గెడ్డం బాబా వెంబడించసాగారు.

కారులో షికారుకి వెళ్ళిన రవి రాధను రక్షించి కారులో ఎక్కించుకుని తీసుకు వెళ్తూ గత స్మృతులు గుర్తు లేక సరికొత్తగా రాధని ప్రేమించసాగాడు.

ఆస్తి కోసం రవిని హత్య చెయ్యడానికి రత్నభూషణరావుగారి వారసులు రాధని హత్య చెయ్యడం కోసం కోటేశ్వర్రావుగారి వారసులు కర్రలతో బయల్దేరి దారిలో ఒకరికొకరు ఎదురై కొట్లాడుకోసాగారు. అటువైపే వచ్చిన కారులో ఉన్న రాధకి రవికి తలొక్కింటికి ఒక్కొక్క దెబ్బ తగిలాయి. పర్యవసానంగా ఇద్దరికీ గత స్మృతులు జ్ఞాపకం వచ్చాయి. వాటితో పాటు పోలీసులు వచ్చి దుండగుల్ని పట్టుకున్నారు.

గతస్మృతి వచ్చిన రవి, తండ్రి రంగయ్యని గుర్తుపట్టి "నాన్నా" అని కౌగలించుకున్నాడు. రత్నభూషణరావు ఆస్తి అంతా అతనికి రాసిచ్చి మంచి వచనాలతో దీవించి వెళ్ళిబోతుంటే రంగయ్య ఆయన్ని పిల్చి "కారు లేకుండా ఎలా వెళ్తారు బాబూ! ఈ రిక్షా తీసేసుకోండి బాబూ" అని రిక్షా త్యాగం చేశాడు. ఆయన రిక్షా తొక్కకుండా వెళ్ళిపోయాడు.

రవి రాధ కేసి చూసి చూపాడు. రాధ సిగ్గుతో తల దించుకుంది.


క్రీగంట అతడ్ని కొంటెగా చూసింది. ఇంతలో గెడ్డంబాబా వచ్చి "రాధకి పిర్ర మీద పుట్టు మచ్చ ఉంటుంది" అన్నాడు. "నీ పుట్టు మచ్చ ఆ గెడ్డంగాడికి ఎలా తెలుసు నీచురాలా" అని రవి ఆమెని అపార్థం చేసుకున్నాడు.

కోటేశ్వర్రావుగార్ని గుర్తుపట్టిన రాధ "నాన్నా" అంటూ వచ్చి తండ్రిని కౌగలించుకుంది. దాన్తో ఆయనకి ఊపిరి ఆడక దగ్గు వచ్చింది. ఆయన కాస్సేపు అలా దగ్గి దగ్గి "రాధ నా స్వంత కూతురు కాదు. పద్దెనిమిదేళ్ళ క్రితం సంతలో దొరికింది. పిర్ర మీద పుట్టుమచ్చ ఉంది" అని చెప్పి చచ్చిపోయాడు. కాని గెడ్డం బాబా ఇచ్చిన కషాయం తాగి గండం గడిచిపోయింది. కొండలన్నీ పరుగెట్టిన ఆయాసానికి గుండెపోటు వచ్చి తట్టుకోలేక, ఎన్ని మూలికల్నీ, ఔషధాల్నీ, రాధని కోటేశ్వర రావు చేతిలో పెట్టి "కన్న తండ్రివి కాక పోయినా రాధ బాధ్యత మీదే!" అని గెడ్డంబాబా హఠాత్తుగా కన్నుమూశాడు.

ఇంతలో రాధ వాంతి చేసుకుంది. పుట్టుమచ్చ సంగతి క్షమించినా రాధకి వాంతి ఎందుకు వచ్చింది. అని రవి మళ్ళీ ఆమెను శంకించబోతూ ఉండగా రాధ అతడ్ని కార్లో ఎక్కించుకుని "ఈ నెత్తావి తెమ్మెరలో నాకు భలే తిమ్మిరిగా ఉంది" అని పాట ప్రారంభించింది. "అవును జ్ఞాపకం వచ్చింది" అన్నాడు రవి.

కథ సుఖాంతమే కానీ పుట్టుమచ్చని మనం చూడలేదే అనే బాధ మనకి మిగిలి పోతుంది. ***(ఆంధ్రజ్యోతి వీక్లీ నుండి)*** ❋

# తండ్రిని మించిన దైవము లేదు



సాధారణంగా తల్లి తన సంతానం మీద ఎంతో ప్రేమ కనబరచి అవి ఎదిగే వరకు కంటికి రెప్పలాగా కాపాడుకుంటుంది. అది సర్వత్రా సత్యమే అయినా కొన్ని సందర్భాలలో తండ్రి పిల్లల పెంపకంలో పూర్తి బాధ్యత వహిస్తుంది. ముఖ్యంగా చేపలలో ఇది కనబడుతుంది.

అందులో మరింత గణనీయమైనది స్టికిల్ బ్యాక్ అనే చేప శాస్త్రీయంగా దీనిని **GASTERUSTEUS ACULEATUS** అంటారు. ఉత్తరార్థగోళంలో చాలా చోట్ల ఇది కనబడుతుంది. పృష్ఠవాజం కొడవలి లాగా ఉంటుంది. దాని ముందు మూడుముళ్ళు ఉంటాయి.

సంతానోత్పత్తి కాలంలో మగచేప పొట్ట ఎర్రగా తయారవుతుంది. మిగతా శరీరం నీలంగా ఉంటుంది. తరువాత నీటి అకులు పుల్లలని జిగటతో అతికించి గూడు తయారు చేసుకుంటుంది. ఆ జిగట మూత్రపిండాల నుంచి తయారువుతుంది. గూడు బంతిలా మధ్య గుండ్రని హోలులా ఉంటుంది.

తరువాత దారినపోయే చేపలని తన గూడులోకి రమ్మని ఆహ్వానిస్తుంది. అలా వచ్చిన ఆడ చేప అందులో గుడ్లు పెట్టి వెళ్ళిపోతుంది. ఆ తరువాత అది మరేమీ పట్టించుకోదు. ఈ తండ్రిచేప వాటిని ఫలదీకరించి కాపాడుకుంటూ ఉంటుంది. ఇలా తండ్రిచేప జాగ్రత్త పడకపోతే ఆ తల్లి చేపే వచ్చి గుడ్లని ఆరగిస్తుంది. మగచేప తన వాజాలతో ఊపుతూ కొత్త నీరు వచ్చేట్లు చేస్తుంది. చెడు పదార్థాలు పనికిరాని గుడ్లని బయటకు తీసి వదిలిపెడుతుంది.

3 వారాల తరువాత పిల్లలు బయట పడతాయి. అల్లరి చిల్లరగా అవి బయటకి పోతే గదమాయించి తిరిగి తన గూడులోకి తరుముతుంది. ఆ తరువాత వాటిని కాపలా కాయడం కష్టం అవుతుంది. అయితే ఆ సరికి అవి స్వంతంగా కాపాడుకోగలుగుతాయి.

చాలావరకు స్టికిల్ బ్యాక్ మంచినీటి చేప. కానీ సముద్రంలో కూడా కనబడుతుంది. యూరప్, ఆసియా, ఉత్తర అమెరికాలలో ఇంకా ఇలాంటి జాతుల స్టికిల్ బ్యాక్‌లు కొద్ది తేడాలతో కనబడుతాయి.

**– జమ్మి కోనేటిరావు**